ప్రజాశక్తి

శుక్రవారం 8 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సాగర తీరం.. సాహసాల హారం..

నేడు నేవీ డే రిహార్సల్స్
10న ఆపరేషనల్ డిమాన్‌స్ట్రేషన్స్
సిద్ధమౌతున్న తూర్పునౌకాదళం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగర తీరానికి ఒక్కొక్క యుద్ధనౌక, జలాంతర్గాములు తరలి వస్తున్నాయి. యుద్ధానికి సన్నద్ధం అవుతున్న వాతావరణంలో సాగర తీరం ఏర్పాట్లతో ఆహ్లాదపరుస్తోంది. దేశం గర్వించదగ్గ నేవీ డే ఈ నెల 4న జరగాల్సి ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా ఈనెల 10కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. రిహార్సల్స్ కూడా వాయిదాపడ్డాయి. శుక్రవారం సాయంత్రం పలు విన్యాసాలను రిహార్సల్స్‌గా తూర్పునౌకాదళం ప్రదర్శించనుంది. మరచిపోలేని అనుభూతిని వీక్షకులకు ఇవ్వనుంది. 10వ తేదీన పూర్తిస్థాయిలో ఆపరేషనల్ డెమో ఉంటుంది. నేవీ డేకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఇంకా పలువురు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, గౌరవ అతిథులు, తూర్పునౌకాదళ ఉన్నతాధికారులు, నగర ప్రజానీకం కోసం సాగర తీరం ఆర్‌కెబీచ్ అంతా హంగులు, రంగులతో

మిగతా 2లో..

అన్నదాత వ్యధ

మునగపాకలో నేల వాలిన పంటను కట్టలు కడుతున్న రైతు

తుపానుతో మునిగిన వరి
పంట నష్టం అంచనాలో జాప్యం
తీవ్రత తక్కువ చేసి చూపే యత్నం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, మునగపాక, ఎస్.రాయవరం విలేకరులు

జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వర్షాల్లేక పంటవేయలేక కొంత, వేసిన తరువాత చేతికొచ్చే సమయంలో పడ్డ వర్షాలతో పంట దెబ్బతిని మరింత నష్టపోయాడు. దుర్భిక్షం వెంటాడినా ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. తుపానుకు వరి, ఉద్యాన పంటలు నేలమట్టమై, నీళ్లపాలైనా వాస్తవ నష్టాలను అంచనావేసేందుకు ప్రభుత్వం చొరవ చూపడంలేదు. పొలాల్లో చేరిన నీరు బయటకు పోయిన తరువాత నష్టాన్ని గుర్తించేలా ఉంది. నష్ట తీవ్రతను తక్కువచేసి చూపేందుకు ఆలస్యంగా ఎన్యుమరేషన్ పని ప్రభుత్వం చేపట్టేలా ఉంది. కరువు మొదలుకొని, భారీ వర్షాల వరకు నష్టపోయిన రైతును ఆదుకోవాలన్న ఆలోచన ఏమూలా కన్పించడంలేదు. సాంకేతికాంశాలను సాకుగాచూపి జరిగిన నష్టం పెద్దగాలేదని చెప్పే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లుంది. చేతికిరావాల్సిన పంట నీటమునగడంతో పెట్టుబడి డబ్బులకు కూడా పంటరాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల్లో వరి సాగుకావాల్సివుండగా, 1,10,765 ఎకరాల్లో (81 శాతం) పంట నమోదైంది. వర్షాభావ పరిస్థితులతో సెప్టెంబరు 30 వరకు రైతులు వరి నాట్లు వేశారు. వర్షాల్లేక, సాగునీటి వనరుల్లేక వరి నాట్లు దాదాపు నెల రోజులు ఆలస్యంగా వేశారు. వరి పంట ఆలస్యంగా వేయడంతో కోతకొచ్చిన సమయంలో డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు దొరికింది. దీంతో వరి రైతులు భారీగా నష్టపోయారు. అక్టోబర్‌లో వర్షాల్లేక 2వేల ఎకరాలకుపైగా వరి పంట ఎండిపోయింది. నాలుగు వేల ఎకరాలకుపైగా వాడిపోయింది. మిగిలిన పంట చేతికొస్తుందని ఆశపడ్డ రైతుకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. దాదాపు 50వేల ఎకరాలకు పైగా పంట నీటమునిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో వరిపొలాల్లో నీరు తగ్గినా ధాన్యం రంగు మారుతుందని రైతులు వాపోతున్నారు. చేను ఎండబెట్టి నూర్చినా, గడ్డి పశువులు తినడానికి పనికిరాదని

మిగతా 2లో..

తుపాను నష్టాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

వార్త 8లో..

వుడా పార్కు అభివృద్ధికి చర్యలు : విశాఖ కలెక్టర్

వార్త 2లో..

రూ.100 కోట్లతో గీతం పరిశోధనా కేంద్రాలు

వార్త 3లో..

మొదటి పేజీ తరువాయి..

సాగర తీరం.. సాహసాల హారం..

సిద్ధమవుతోంది.

అత్యద్భుత సామర్థ్యంతో ప్రదర్శనలు...

నావికాదళం ఈ సారి అత్యంత అద్భుతమైన ప్రతిభాపాటవాలు, శక్తి యుక్తులతో కూడిన ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తూర్పునౌకాదళ అధికారి రాజేష్ పెందార్కర్ ఇటీవలే మీడియా కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. నౌకలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమానాలు, ప్రత్యేక నావికాదళ బలగాలు సముద్ర తీర ప్రదర్శనలు అబ్బుర పరచనున్నాయి. యుద్ధ సమయాల్లో నౌకలు నిర్వహించే పాత్ర, అందులో దళాల శక్తి యుక్తులపై ప్రత్యేకంగా ఆపరేషన్స్ నావికాదళం చేపట్టనుంది. యుద్ధవిమానాలు ఒకదానికొకటి ఎదురెదురుగా దూసుకువస్తూ ఢీకొనేటంతగా చూపరులను నిర్ఘాంతపోయేలాంటి సన్నివేశాలు 10న నిర్వహిస్తున్నారు. మెరైన్ కమోండోల సాహసాలు, యుద్ధం సమయంలో సముద్రంలో చిక్కుకున్న నౌకలు, అందులో సైన్యాన్ని తప్పించేందుకు మెరైన్ కమోండోలు చేపట్టే సాహసాలు ఉంటాయి. ఒక యుద్ధనౌకను పూర్తిగా కాంతులతో అలంకరించి సూర్యాస్తమయ సమయానికి చూపరులను ఆశ్చర్యచకితులను చేసేలాగ 10న సాయంత్రం ఆపరేషనల్ డెమో అనంతరం నేవీ సముద్రం మధ్యలో నౌకను యాంకర్ చేసి ఉంచుతుంది. ఇది వీక్షకులను ప్రతి సంవత్సరం ఆహ్లాదపరుస్తూ ఉంటుంది. మెరైన్ కమోండోలు నీటిలో స్కై డైవింగులు చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకూ అలరించనున్నాయి. సంప్రదాయబద్ధంగా తూర్పునౌకాదళాధిపతి ఏటా మాదిరిగా ముఖ్య అతిథి గవర్నర్‌కు ఘనమైన ఆతిథ్యాన్ని ఇవ్వనున్నారు. నేవీ హౌస్‌కు ముందుకు 10న తీసుకెళ్లి అక్కడ హోం ఫంక్షన్ అనంతరం ఆర్‌కెబీచ్‌లో జరిగే విన్యాసాలకు తీసుకుని రానున్నారు.

ఈ రెండు రోజులే కీలకం: నగర పౌరులకు నేవీ సూచనలు..

నేవీ డే సందర్భంగా 8, 10 తేదీల్లో జరుగనున్న రిహార్సల్స్, ఆపరేషనల్ డెమోలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా 'గ్రీ బీచ్ (అంటే పర్యావరణ హితంగా) సాగర తీరాన్ని ఉంచాలని నగర పౌరులు సాగర తీరంలో ఎలాంటి తినుబండరాలు వదిలేయకూడదని నావికాదళ అధికారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను ఒడ్డున విసిరేయకుండా, తీరంలో పడేయకుండా జాగ్రత్త వహించాలని తూర్పునౌకాదళం గురువారం రాత్రి ఒక ప్రకటనలో నగర ప్రజానీకాన్ని కోరింది. జివిఎంసి ఈ మేరకు తగిన ఏర్పాట్లు, చర్యలు తీసుకోవాలని సూచించింది. అసంఖ్యాకమైన యుద్ధ విమానాలు, ఫ్లైట్స్ గగనతలంలోకి వెళ్లే సందర్భంగా కాకులు, ఇతర పక్షులు అడ్డం రాకుండా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాగర తీరంలో తినుబండరాలు, ఇతర ఫుడ్ ఐటెమ్స్ తీసుకురావద్దని తెలిపారు. ఫ్లైట్స్ భద్రత రీత్యా ఈ జాగ్రత్త పాటించాలని కోరారు. అలాగే గాలిపటాలు ఎగరవేయడం వంటివి చేయకూడదు.

అన్నదాత వ్యథ

రైతులు అంటున్నారు. నీరున్న వరి పొలాల్లో కట్టల్లా కట్టి చేను నిలబెడుతున్నారు.

పంటంతా నీటిలో మునిగింది

సొంతభూమి ఎకరా 20 సెంట్లు, కౌలుకు 40 సెంట్లు తీసుకొని వరిపంట వేశాను. భార్య పుస్తులు పెనుగోలు ఎస్‌బిఐలో తనఖాపెట్టి డబ్బులు తెచ్చి రూ.35వేలు పెట్టుబడి పెట్టాను. పంట మొత్తం నీటమునగడంతో పెట్టుబడికి కూడా పంటరాదు. ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోతే అప్పు మిగిలిపోతుంది.

సిపాదుల గోవిందరావు, ధర్మవరం, ఎస్.రాయవరం మండలం

సుగర్ ఫ్యాక్టరీలేక నష్టపోతున్నాం

ఊరుకు దగ్గర్లోని ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ పనిచేసినంతకాలం చెరకు పండించి తీసుకెళ్లేవాళ్లం. ఫ్యాక్టరీ మూతేశాక వరి, కాయగూరలు పంట వేస్తున్నాం. పంట చేతికివచ్చిన సమయంలో యేటా వర్షాలు రావడంతో పంటలు పోతున్నాయి. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలి.

కడిగట్ల మాణిక్యం, సర్పంచ్ ధర్మవరం

తిండికి ధాన్యం కొనుక్కోవాలి

వర్షాల్లేక కాలువల నీరు తోడుకొని ఎకరా భూమిలో వరి వేశాను. రూ.30వేలు పెట్టుబడి అయింది. ఇంట్లో బంగారం తాకట్టుపెట్టి ఎస్‌బిఐలో రుణం తీసుకున్నాను. ఏడాదికి సరిపడా ధాన్యం ఉంచుకొని, మిగిలిన పంట అమ్మి అప్పుతీర్చుదామనుకున్నాను. పంటంతా నీటిలో మునగడంతో తిండికి కూడా ధాన్యం కొనుక్కోవాలి. అప్పు మిగిలిపోతుంది.

బొడ్డేడ గోవిందరావు, మునగపాక

నేడు కొండ గుడి పండగ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో ప్రసిద్ది చెందిన 'కొండ గుడి మేరీ మాత' ఉత్సవ సంబరం శుక్రవారం రోజీహిల్స్‌పై జరుగనుంది. ఏటా డిసెంబర్ 8వ తేదీన పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చారిత్రాత్మకంగా చూసినప్పుడు క్రిస్టియన్లకు ఇది అత్యంత ప్రియమైన పండగగా వస్తోంది. 1854 సంవత్సరం నుంచి ఈ కొండగుడి ఉత్సవాన్ని జరుపుతున్నట్లు చరిత్ర ద్వారా వెల్లడవుతోంది. మేరిమాతను కొలిచే భక్తులంతా విశాఖలోని వన్ టౌన్ ఏరియాలో గల కొండగుడికి డిసెంబర్ 8న వేల సంఖ్యలో రావడం ఆవాయితీగా వస్తోంది. నవంబర్ 29న పతాక ఆవిష్కరణతో నవదిన ప్రార్ధనలు ప్రారంభమై పండగ రోజు డిసెంబరు 8న కానుకలు ఏమైనా సమర్పించదలిస్తే గురువులు, బ్రదర్స్ కన్యలకు మాత్రమే ఇవ్వాలని, అది కూడా గుడిలోపల మేరిమాత గుహ వద్ద గుడిముందున్న స్వరూపం వద్ద మాత్రమే యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జపమాలలు, కొవ్వొత్తులు, పాటల సీడీలు గుడి ఆవరణలో పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు. కొండపైకి భక్తులను శుక్రవారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అనుమతిస్తారు. దేశం నలుమూలల నుంచి ఈ పండగకు భక్తులు ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ట్రాఫిక్ ఆంక్షలు

గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు పోర్టు ఏరియా రోజ్ హిల్స్ కొండపై జరిగే పండగ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు ప్రకటించారు. ఈ పండగకు సుమారు లక్ష మందికి పైగా వచ్చే అవకాశం ఉన్నందున వాహనాల మళ్లింపునకు సూచనలు చేశారు. సి హార్స్ జంక్షన్ నుంచి రోజు హిల్స్ వెళ్లే దారిలో వాహనాలను అనుమతించరు. పాత పోస్ట్ ఆఫీస్ ఆర్‌టిసి బస్సులతో వచ్చే అన్ని వాహనాలు సున్నపు వీధి నుంచి వెలంపేట, గోపాల్ ఆటో జంక్షన్, లక్ష్మీ టాకీస్ మీదుగా విక్టోరియా రాణి విగ్రహం వద్దకు చేరుకొని తిరిగి అదే దారిలో వెనక్కి వెళ్లాలి. బీచ్ రోడ్డు కోటవీధి వైపు వచ్చే వాహనాలు బీచ్ రోడ్డులోనే సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు మాత్రమే హార్బర్ ఓల్డ్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వెనుక అదాని రోడ్డు పప్పుల గూడెం రోడ్డులో పార్కింగ్‌కు కార్గను హార్బర్, ఓల్డ్ పోలీస్ స్టేషన్ వెనుక, పోర్ట్ వెంకటేశ్వర గుడి వద్ద పార్కింగ్ చేసుకోవాలి. యాత్రికులు తీసుకొచ్చిన బస్సులను కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్ట్ ఆవరణలో నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వుడా పార్కు అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

పార్కులో పాడైపోయిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వుడా పార్కు అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల తక్షణ మరమ్మతులు చేపట్టాలని వివిధ విభాగాల అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. వుడా పార్కును గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. చిన్న పిల్లల ప్లే పార్కులో పలు ఆట పరికరాలు పాడైపోవటాన్ని గుర్తించి కొత్తవాటిని అమర్చాలని సూచించారు. పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. వెలగని విద్యుత్ దీపాలను మార్చి కొత్తవాటిని వేయాలని చెప్పారు. వర్షపు నీరు సులభంగా బయటకు పోయేలా డ్రైయిన్లను సరిగ్గా నిర్మించాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీచ్ వైపు పార్కుకు ఆనుకొని ఉన్న గోడను పటిష్టం చేయాలని, అవసరమైతే ఎత్తు పెంచాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. బాస్కెట్ బాల్, షటిల్ కోర్టుల మెరుగైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. లీజ్ విధానం లేదా మంత్లీ ప్రవేశ ఫీజు వసూలు విధానంపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ సెక్రటరీ డి.కీర్తి, సిఇ, డిఎఫ్ఒ, ఎఫ్ఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ పై తాత్సారం తగదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నాయని విశాఖ రైల్వే జోన్ సాధన సమితి కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి విమర్శించారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని ఇవ్వలేదని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంటులో వెల్లడించారని తెలిపారు. జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.106.89 కోట్లు మంజూరు చేశామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10 కోట్లు కేటాయించామని చెప్పారని పేర్కొన్నారు. రైల్వే భూమిని బిఆర్‌టిఎస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నందున, దానికి బదులుగా ముడసర్లోవలో 52.2 ఎకరాల భూమిని రైల్వేకి ప్రభుత్వం అప్పగించాల్సి ఉందని, అక్కడ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణాన్ని ప్రతిపాదించామని చెప్పారని తెలిపారు. రైల్వే జోన్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాట ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. రైల్వే జోన్ ఎప్పటినుంచి ప్రారంభిస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

విశాఖ బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫాదర్ రత్నకుమార్ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవ్ ఆధ్వర్యాన సెయింట్ ఆంథోనీ స్కూల్లో ఈ నెల 14,15,16 తేదీల్లో జరిగే "మెగా చిల్డ్రన్ ఫెస్టివల్" కు సంబంధించిన పోస్టర్‌ను ఆర్‌సిఎం స్కూల్స్ కరెస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్‌తో కలిసి పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ బృందంలో విశాఖ బాలోత్సవ అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.రమాదేవి, సంతోష్ తదితరులు ఉన్నారు. ఫెస్టివల్ నిర్వహణకు అనువుగా స్కూల్ గదులను, ఆవరణను సిద్ధం చేస్తానని ఫాదర్ రత్నకుమార్ హామీ ఇచ్చారు.

సాయుధ దళాల పతాకదినోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సాయుధ దళాల పతాక దినోత్సవ వేడుకల కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం తమ కార్యాలయంలో సాయుధ దళాల పతాక నిధికి తొలి విరాళాన్ని అందజేశారు. జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాకదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పతాక నిధికి విరివిగా విరాళాలు అందించవలసినదిగా, జిల్లాలోని పౌరులను, వ్యాపార వేత్తలను, పారిశ్రామికవేత్తలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఒ కె.మోహన్‌కుమార్ కూడా సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం పాల్గొన్నారు.

ప్రజల సొమ్మునే జగన్ పంచుతున్నారు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలైన సొమ్మునే సంక్షేమ పథకాలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి పప్పుబెల్లాల్లా పంచి పెడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఎద్దేవా చేశారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మిచౌంగ్ తుపానుపై అప్రమత్తం చేయడంలో, సహాయకచర్యలు చేపట్టడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తుపానుతో చేతికొచ్చిన పంట నీటి పాలై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తుపాను వస్తుందని పది రోజుల కిందటే వాతావరణ శాఖ ప్రకటించినా జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని విమర్శించారు. ప్రజలు తుపానుతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా తాడేపల్లి పేలెస్‌ను జగన్ వదలడం లేదని ఎద్దేవాచేశారు.

మీడియాతో మాట్లాడుతున్న నజీర్

CHANGE OF NAME

I, VENKATARAMANA GUMMIDI, S/o G SATYAM, D.No. 3-41, Gandhavaram (V) & (P), Padmanabham(M), Visakhapatnam Dist, Andhra Pradesh-531219. Changing my daughter Name GUMMUDU CHAITRIKA (Old Name) to **GUMMIDI CHAITRIKA** (New Name) hence forth Iam being called as **GUMMIDI CHAITRIKA** (New Name) for all purposes

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మి, వైసిపి నేతలు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని పొడుగుపాలెంలో సిసి రోడ్లు, డ్రైనేజీ, జంగాల కాలనీలో రోడ్డు నిర్మాణం, ఎస్‌సి,బిసి కాలనీలో సిసి రోడ్డు, దొంతలవారి కల్లాలు మంచినీటి పైపులైన్ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇచ్చిన హామీల మేరకు నిధులు మంజూరు చేయగా, సర్పంచ్ చందక లక్ష్మి, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, షినగం చిన్న రామారావు, చందక అప్పలస్వామి, చందక సూరిబాబు, రాంజీ, చందక అప్పలనాయుడు, పంచాయితీ కార్యదర్శి శ్రీరామమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా
9,10 తేదీల్లో పిల్లలకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9 10 తేదీల్లో తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాల్లోని పిల్లలకు ఉచిత ఒపిడితోపాటు, ఉచిత రక్త పరీక్షలు చేయనున్నట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ టి తిరుపతిరావు తెలిపారు. గాజువాకలోని సన్‌రైజ్ ఆసుపత్రితోపాటు, మర్రిపాలెం సుజాతనగర్, పరవాడలోని తమ ఆసుపత్రుల్లో ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయని, ఆయా ప్రాంతాల్లోని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95603 77799,70366 44666 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రతిఒక్కరూ ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయంఉపాధితో ఎదగాలని వెల్లంకి సీనియర్ రిటైర్డ్ మాస్టర్ కంటిమహంతి శివప్రసాదరావు అన్నారు.
గురువారం వేములవలస జిఎస్‌ఎన్ ఫంక్షన్ హాల్ సమీపంలో కె.జగదీశ్వరరావు నూతనంగా ఏర్పాటు చేసిన సాయిప్రగతి వెజిటబుల్ కాయగూరల హోల్‌సేల్ దుకాణాన్ని ప్రారంభించారు. వ్యాపారవేత్త షినగం అప్పలరాజు, దాడి రామకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు

నేటి నుంచి ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : ఇవిఎంలలో ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఓటర్లకు ఈనెల 8 నుంచి 19 వరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తామని తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు, ఈనెల 8న శుక్రవారం ఉదయం పొట్నూరులోని ఒకటి, రెండు పోలింగ్ కేంద్రాల్లోనూ, మధ్యాహ్నం శేరిఖండం పోలింగ్ కేంద్రంలోనూ అవగాహన కల్పిస్తామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రూ.100 కోట్లతో గీతం పరిశోధనా కేంద్రాలు

పర్యావరణం, ప్రజారోగ్య హితమైన ఉత్పత్తులే లక్ష్యం
వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం

జ్యోతిప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న గీతం విసి దయానంద

ప్రజాశక్తి- మధురవాడ : బోధనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రూ.100కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ది చేస్తున్నామని గీతం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం వెల్లడించారు. శాస్త్ర విజ్ఞానంలో దేశం గర్వించదగ్గ అత్యున్నత పరిశోధనలను నిర్వహించాలనేది గీతం లక్ష్యమని స్పష్టం చేశారు.

గురువారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న గీతం కెమిస్ట్రీ రీసెర్చి కాన్ఫడెన్స్-2023ను ప్రారంభించారు. ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ, వైద్యవిభాగాల మధ్య అనుసంధానంతో అంతర్విభాగ పరిశోధనలపై తాము దృష్టి సారిస్తున్నామన్నారు. రసాయనిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు పరిశ్రమల నుంచి ప్రకృతికి హని కలిగించని పర్యావరణ హితం కోరే హరిత రసాయన ఉత్పత్తుల తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. ఆహర ఉత్పత్తుల వృద్ధికి క్రిమిసంహరకాలను, రసాయన ఎరువులను వాడటం సరికాదని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శరీరంలో వ్యాధినిరోధకశక్తిని పెంచే ప్రత్యామ్నాయ ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని శాస్త్ర వేత్తలకు పిలుపునిచ్చారు.
తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ జెఎన్.మూర్తి సైన్స్ పరిశోధనలకు గీతం వర్సిటీ ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ శిలాజ ఇంధనాలు, ప్లాస్టిక్ వంటివి వర్యావరణాన్ని దెబ్బతీయకుండా హరిత రసాయన ఉత్పత్తులపై పరిశోధనలు జరపాలన్నారు. రసాయన విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు విభాగం ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్

పింఛన్ల నగదు మాయంపై వాలంటీర్లను నిందించొద్దు

జెడ్‌సి ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి -పిఎం.పాలెం: జివిఎంసి రెండో జోన్ కె3 కాలనీ 41వ సచివాలయంలో పింఛను నగదు మాయంపై సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ తమపై నిందారోపణలు చేస్తున్నారని స్థానిక వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం జెడ్‌సి కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు.
ఇటీవల 41వ సచివాలయం పరిధిలో రూ.49750 పింఛను నగదు మాయం కాగా, వెల్ఫేర్ సెక్రటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇంతలో మూడు నెలల క్రితమే రాజాం నుంచి బదిలీపై వచ్చిన వెల్ఫేర్ సెక్రటరీ వై.అన్నపూర్ణ, దీనికి వాలంటీర్లే కారణమని నిందారోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నాలుగేళ్లుగా వాలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, ఆలా ఎన్నడూ జరగలేదన్నారు. వెల్ఫేర్ సెక్రటరీ ఇక్కడ బాధ్యతలు చేపట్టిన తర్వాతే గడచిన రెండు నెలల్లో రూ.15వేలు, రూ.5వేలు చొప్పున పింఛను నగదు మాయంకాగా, ఆ సొమ్మును వెల్ఫేర్ సెక్రటరీ భరించిందన్నారు. ఈ నెలలో ఏకంగా రూ.49,750 నగదు మాయంపై నేరాన్ని తమపై మోపుతున్నారని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుపై విచారణ జరుగుతున్న సమయంలో వెల్ఫేర్ సెక్రటరీ తమపట్ల దురుసుగా ప్రవర్తించడం సరిదన్నారు, వెల్ఫేర్ సెక్రటరీ తీరుతో వేదనకు గురౌతున్న నేపథ్యంలో పింఛను నగదు మాయం వ్యవహారంలో దోషులు తేలేవరకు వేరే వెల్ఫేర్ సెక్రటరీని నియమించాలని కోరారు.

పంట నష్టాలను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి -తగరపువలస :తుపాన్ ప్రభావంతో భీమిలి మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన, నేలవాలిన వరిపైర్లను స్థానిక ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు (వాసురాజు), దాకమర్రి పంచాయితీ సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపిటిసి సభ్యులు నగేష్‌బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. దాకమర్రి లో నీట మునిగిన, నేల వాలిన వరి పంట పొలాలను పరిశీలించారు. రైతుల కష్టాన్ని, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టాన్ని రైతులు వివరించారు

సంక్షేమ పథకాలపై ప్రచారం

వార్డులో పర్యటిస్తున్న ఆనందకుమార్, శ్రీధర్

ప్రజాశక్తి -ఆనందపురం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా చేపట్టిన సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురవారం మండలంలోని గిడజాలలో 'ఎపికి మళ్లీ జగనన్న ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా వైసిపి పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. గిడజాలలో సంక్షేమానికి రూ.24.81కోట్లు, అభివృద్ధికి రూ.63.29కోట్లను ప్రభుత్వం వెచ్చించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, రామకృష్ణ, సర్పంచులు షినగం అప్పలరాజు, బిఆర్‌బి. నాయుడు, కోరాడ ముసలి నాయుడు, రౌతు శ్రీను, బల్రెడ్డి మహేష్, డోలా ఆనంద్, రమణారావు పాల్గొన్నారు.

వేపగుంట : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఆంధ్రాకు మళ్లీ జగనే రావాలని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు.గురువారం 52వ వార్డు సాకేతపురం సచివాలయం పరిధిలోని గౌరీనగర్ రిక్షాకాలనీలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రూ. 40 లక్షల నిధులతో అభివృద్ది చేసిన సిసి రోడ్లను ప్రారంభించారు. సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ జిల్లా చైర్మన్ అల్లా కృష్ణ, వార్డు అధ్యక్షులు జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీను, శ్రీదేవివర్మ, ఆర్.పి.లు, వాలంటీర్లు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి పథకాలు

యస్ రాయవరం:మండల కేంద్రంలో ఆంధ్ర ప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరు అయ్యారు. ముందుగా సెంటర్లో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. పేదల అభివృద్ధికి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాకర్ల దేవి, ఎంపీపీ కోన రామలక్ష్మి, వైస్ ఎంపీపీ అప్పన్న, మండల పార్టీ అధ్యక్షులు కొనతల శ్రీను, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, సర్పంచ్ లు గణేష్, శ్రీను బాబు శ్రీరాములు ఎంపీడీఓ రామచంద్ర మూర్తి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గురువారం జగ్గు సెంటర్‌లో చోటుచేసుకుంది. బిసి రోడ్డుకు చెందిన భాస్కరరావు(65) జగ్గు జంక్షన్‌లోని స్క్రాప్ దుకాణంలో సామాన్లు ఇచ్చేసి, తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో వెనక నుండి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన భాస్కరరావు సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధించిన కేసులో
భర్తకు నాలుగు నెలల జైలుశిక్ష
- రూ. వెయ్యి జరిమానా

ప్రజాశక్తి -భీమునిపట్నం : భార్యను వేధించిన కేసులో భర్తకు నాలుగు నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారని సిఐ రమేష్ తెలిపారు. వివరాలివి. తగరపువలస, కొత్తపేటకు చెందిన మోహనరావు తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు పెంకుతో తలపై మోదినట్లు అతని భార్య కాపు పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు అనంతరం నిందితుడైన ఆమె భర్తను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.
ఛార్జిషీట్ దాఖలు అనంతరం కేసు విచారణలో భాగంగా నేరాభియోగాలు నిర్ధారణ కావడంతో నిందితుడు మోహనరావుకు 4నెలల జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు సిఐ రమేష్ తెలిపారు. అంతేగాక బాధితురాలు పావనికి, ఆమె భర్త నష్టపరిహారం కింద రూ.2వేలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేసినట్లు సిఐ తెలిపారు.బాధితురాలికి న్యాయం చేసేందుకు సిఐతో పాటు హెచ్‌సి కాంతారావు కృషి చేశారని పోలీసులు తెలిపారు

మందుబాబులకు జరిమానా

డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు తీర్పు... సామాజిక సేవ శిక్ష

శుభ్రపరిచే పనులు చేస్తున్న డ్రంకెన్ డ్రైవ్ కేసు నిందితులు

ప్రజాశక్తి - ఆనందపురం :డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన మందుబాబులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా, సామాజిక సేవ చేయాలని భీమునిపట్నం 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి విజయలక్ష్మి తీర్పునిచ్చారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 65మందిపై కేసులు నమోదు చేశారు. నిందితులను స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పలరాజు కోర్టులో ప్రవేశపెట్టగా, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సామాజిక సేవ చేయాలన్న న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులతో భీమిలి ఎఎంజి పాఠశాల, భీమిలి ఇండోర్ స్టేడియం పరిసరాలను పరిశు భ్రం చేయించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -మధురవాడ: ప్రభుత్వభూమిలో అక్రమణలను రెవిన్యూ అధికారులు గురువారం తొలగించారు. సర్వే నెంబరు 18,19, 20, 21లతోపాటు 45, 48లలో ఉన్న గెడ్డ ఆక్రమణలను గుర్తించిన రెవిన్యూ అధికారులు, సిబ్బంది సాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. తొలగింపు కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, అనూష, తహశీల్దార్ రమణయ్య పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి దురాక్రమణ చట్టరీత్యా నేరమని, బాధ్యులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

17న పెన్షనర్స్‌డే, 20న రాస్తారోకో
జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సుధాకర్

ప్రజాశక్తి -గాజువాక : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టే ఉద్యమాల్లో భాగంగా ఈనెల 17న పెన్షనర్స్‌డే , 20న రాస్తారోకోను జయప్రదం చేయాలని ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకుడు కె.సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక సిఐటియు కార్యాలయంలో ఇపియస్ 95 పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు పాల్గొని పెన్షనర్ల ప్రస్తుత పరిస్థితి, రాబోయే రోజుల్లో చేయాల్సిన ఉద్యమాలను వివరించారు. సమావేశంలో.జిల్లా ఉపాధ్యక్షులు యువియస్‌యన్ వర్మ, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, అధ్యక్షుడు కె దీనబంధు మాట్లాడారు. పెన్షనర్ల అసోసియేషన్ గాజువాక కార్యదర్శి డి.అప్పారావు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, జింక్, భెల్, ఇతర సంస్థల్లో రిటైరైన పెన్షనర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమావేశానికి ముగింపుగా షిప్‌యార్డు యూనియన్ మాజీ నాయకులు రెడ్డిపల్లి బాబూరావు వందన సమర్పణ చేశారు.

రాష్ట్రస్థాయి 'షూటింగ్ బాల్' పోటీలకు
సన్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో సన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్థానిక సన్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ నెల 3న చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -19 బాల బాలికల పోటీల్లో రాష్ట్రజట్టుకు సన్‌స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులుఎన్ హారిక, ఎల్ యషిక, డి యశోద, వి జ్యోతి స్వరూప్, ఎన్ మనోజ్‌కుమార్, జి శ్రీరామ్, 9వ తరగతి విద్యార్థిని డి జె జాహ్నవి ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్ అభినందించారు

భక్తులకు ఉచిత హృద్రోగ పరీక్షలు

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సతీష్

ప్రజాశక్తి- పిఎం.పాలెం: జివిఎంసి ఆరో వార్డు పిఎం పాలెం ఆఖరి బస్‌స్టాప్ సమీపంలోని షిరిడి పద్మసాయి ఆలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా బిపి,సుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. చికిత్స చేసిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, సభ్యులు నారాయణరావు, పాపారావు అజయ్‌కుమార్, సర్వ దేవళ్ళు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు తెలిపారు.

ధాన్యం మొలకెత్తకుండా తక్షణ చర్యలు

రైతులకు సూచనలు చేస్తున్న జెడిఎ అప్పలస్వామి

ప్రజాశక్తి -పద్మనాభం: తడిసిన వరిచేను, కుప్పల్లోని ధాన్యం మొలకెత్తకుండా రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు.గురువారం. మండలంలోని మద్ది, విలాస్‌ఖాన్ పాలెం గ్రామాల్లో పర్యటించారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో నీటమునిగిన వరిచేను, ధాన్యం కుప్పలను పరిశీలించారు. మూడురోజులుగా నీటి తడిలో ఉండడం వల్ల ధాన్యం గింజలు మొలకెత్తుతున్నట్లు గమనించి, రైతులకు సూచనలు చేశారు. పంటకాలంలోనే సాగునీటి కాలువలనుసరిగా శుభ్రం చేసుకుని ఉంటే నీటి ముంపు ప్రమాదం ఉండేది కాదన్నారు. నీటి నిల్వను పూర్తిగా తీసేయాలని,వరిచేనును ఆరబెట్టి, మొలకలు రాకుండా ఎకరా చేనుకు ఐదు కిలోల కల్లు ఉప్పును 25లీటర్ల నీటిలో కలిసి తడిసిన చేనుపై పిచికారీ చేయాలని సూచించారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు. విశాలాక్షి, సరిత పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, ఎంవి చలం, రైతులు కృష్ణ, శంకర్, పైడన్న శ్రీను,నరసింహులు పాల్గొన్నారు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి: డిఎంహెచ్‌ఓ

ప్రజాశక్తి- సీతమ్మధార : తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు తెరిపినిచ్చిన నేపథ్యంలో పారిశుధ్యం క్షీణించకుండా యుపిహెచ్‌సి వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పి.జగదీశ్వరరావు సూచించారు. వర్షాలు తగ్గినప్పటికీ, పారిశుధ్యం క్షీణించడం, నీరు కలుషిత కావడంతో డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, శీతల గాలులతో జలుబు, దగ్గు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు దోమలు విజృంభించి,డెంగీ, మలేరియావ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం క్షీణించడం వల్లే వ్యాధులు ప్రబలాయన్న అపవాదు రాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనారోగ్యానికి గురైన ప్రజలు సమీప ఆరోగ్యకేంద్రానికి వెళ్లి ప్రభుత్వపరంగా ఉచిత వైద్యసేవలు పొందాలని సూచించారు. మలేరియా సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించి, జ్వరాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పట్టణంలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తత అవసరం

'కిమ్స్ కడల్స్' ఆసుపత్రి పీడియాట్రీషియన్ డాక్టర్ నిఖిల్

పిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

ప్రజాశక్తి -గాజువాక: డెంగీ జ్వరాలపై చిన్నపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు వైజాగ్ కిమ్స్ కడల్స్ ఆసుపత్రికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నిఖిల్ తెన్నేటి సూచించారు. గాజువాకలోని వుడా కాలనీలోని ది కార్విన్ స్కూల్లో రెండు రోజులుగా చిన్నపిల్లల ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయని, శీతలగాలులు, చల్లని వాతావరణంతో పిల్లల్లో వివిధ రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా దోమకాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తత, తగు జాగ్రత్తలు అవసరమన్నారు. దోమలు, వాటి లార్వాలు విజృంభించకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మంచినీటి నిల్వలోనే వృద్ధి చెందే దోమల వల్లే డెంగీ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పిల్లలకు వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినిపించాలన్నారు. ఫ్రిజ్‌లో పెట్టిన నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను మళ్లీ వేడిచేసి తినడం ఎవరికీ మంచిది కాదన్నారు. స్కూళ్లకు పంపే చిన్నారులకు వెచ్చని దుస్తులు ధరించి పంపాలన్నారు.వైద్యశిబిరంలో 200 మందికి పైగా పిల్లలకు ఉచితంగా స్క్రీనింగ్, ఎత్తు, బరువు పరీక్షలు చేశారు. ప్రిన్సిపల్ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు..

జనసేనలో చేరిన సుందరపు వెంకట సతీష్‌కుమార్



సతీష్‌కుమార్‌ను జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ సోదరుడు సుందరపు వెంకట సతీష్ కుమార్ గురువారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని ఎఎస్.రాజా కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పార్టీ ప్రారంభం నుంచీ సతీష్‌కుమార్ పార్టీకి విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. ఆయనను పార్టీలోకి రావాలని ఎప్పుడో కోరానని, ఇంతకాలానికి ఆయన మనసు మార్చుకుని పార్టీలో చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆయన చేరిక ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం సుందరపు వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ, పవన్ రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేసే నాయకుడని అన్నారు. ఇప్పటివరకు పార్టీకి వెనుక ఉండి సేవలందించానని, ఇక నుంచి ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేసేందుకు పార్టీలో చేరానని, తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్, పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, నాగబాబు, పంచకర్ల సందీప్, వంపుల గంగులయ్య, బీసెట్టి వసంతలక్ష్మి, మూగి శ్రీనివాసరావు, పరుచూరి భాస్కరరావు, పసుపులేటి ఉషాకిరణ్, బోడపాటి శివదత్త, పాలవలస యశస్వి, కందుల నాగరాజు, దల్లి గోవిందా, పివిఎస్ఎన్.రాజు, బొలిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెరుగుతున్న వరి పంట నష్టాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వర్షం తెరిపినిచ్చినా నీటి ముంపు ఇంకా తొలగిపోకపోవడంతో పంట నష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోభీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఇప్పటి వరకూ 110 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. రెండ్రోజుల క్రితం 73 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వెల్లడించిన వ్యవసాయ శాఖ అధికారులు, గురువారం క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అదనంగా మరో 37 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందన్నారు. భీమిలి మండలంలో తాటితూరులో 12 ఎకరాలు, నారాయణరాజుపేటలో 10 ఎకరాలు, టి నగరపాలెం, తాళ్ళవలసలో చెరో ఐదు ఎకరాలు, మొత్తంగా 32 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది

ఆనందపురం మండలంలో పెద్దిపాలెంలో 15 ఎకరాలు, గొట్టిపల్లిలో ఆరు, బోనిలో 4, ఆనందపురంలో 3, వెల్లంకిలో రెండు, ముచ్చర్లలో ఎకరంన్నర మొత్తంగా 31.5ఎకరాల్లో పంట దెబ్బతింది. పద్మనాభం మండలంలో బాందేవపురంలో 12,5, చిన్నాపురంలో 11.25, రెడ్డిపల్లిలో 5, తునివలసలో 3.75, రేవిడి, కోరాడల్లో చెరో 2.5 ఎకరాల్లో మొత్తంగా 37.5 ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ వెల్లడించారు.

స్కేటింగ్ చిన్నారి సింధుకు అభినందన

స్కేటర్ సింధును అభినందిస్తున్న నగర మేయర్ గొలగాని

ప్రజాశక్తి - ఆరిలోవ: క్రీడలలో విశాఖ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆకాంక్షించారు.. గురువారం జాతీయ స్కేటింగ్ పోటీలలో పతకాలు సాధించిన నాలుగేళ్ల చిన్నారి ఎ.సింధును క్యాంప్ కార్యాలయంలో మేయర్ అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హిమాచలప్రదేశ్ ధర్మశాలలో గతనెల28, 29 తేదీలలో నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ ఇన్‌లైన్ స్పీడ్ అండ్ స్లో పోటీలలో చిన్నారి సింధు మూడు బంగారు, ఒక రజతపతకం సాధించడం అభినందనీయమన్నారు. సింధును ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. చిన్నగదిలి లిటిల్‌స్టార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సింధు చదువుతోంది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కోచ్, సింధు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

అర్జీలు స్వీకరిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె రాజు అన్నారు. గురువారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలను సంబంధించి వినతిపత్రాలు, దరఖాస్తులు తీసుకుని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

పంటలను పరిశీలించిన పలు పార్టీల నాయకులు

మొలలోతులో నీరు నిల్వ ఉన్న వరి పంటను పరిశీలిస్తున్న పీలా తదితరులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వీచిన గాలులు, ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలను టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు గురువారం పరిశీలించారు. పంటలను నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

కశింకోట : దెబ్బతిన్న వరికి ఎకరాకు 30వేలు నష్టపరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఏనుగు తుని, జే.తుని, ఎన్‌జీ పాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. జగన్ రెడ్డికి రైతుల కష్టాలు కనిపించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. బాధిత రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, ఉగ్గిన రమణ మూర్తి, కాయల మురళి , నయనం శెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, మజ్జి నిరంజన్ కుమార్, ఎంపిటిసీ షేక్ దర్గా, ఎలమంచిలి వెంకట రావు, అందే సన్యాసిరావు, కాపుశెట్టి శివ పాల్గొన్నారు.

చీడికాడ : తుపాను తీవ్రత మూలంగా మాడుగుల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో రైతులు తీవ్రంగా నష్ట పోయారని, వారిని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు డిమాండ్ చేశారు. చీడికాడ మండల టీడీపీ నేతలతో కలిసి వరహాపురం తదితర నష్ట ప్రభావ ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పేరపు కొండబాబు, రెడ్డి సన్యాసినాయుడు, రెడ్డి రాము, ధర్మిశెట్టి వరహాలనాయుడు, తాటికొండ దేముడునాయుడు, చెట్టుపల్లి సర్పంచ్ గొర్లె గణేష్, పాతాళం మహేష్, పాతాళం నాగసత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని వెంకుపాలెం, కుంచంగి, తగరంపూడి, సీతానగరం గ్రామాల్లో వందల ఎకరాల్లో నీట మునిగిన పంటలను టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గురువారం పరిశీలించారు. పంటలు మునిగి రైతులు లబోదిబోమంటున్నా మంత్రి గుడివాడ అమర్నాథ్ రైతులను పరామర్శించకపోవడం శోచనీయమన్నారు.

మండలంలోని రేబాక ప్రాంతంలో పంట పొలాలను జనసేన నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రైతులను అప్రమత్తం చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టడంలోనూ, నష్టపోయిన పంటలను గుర్తించడంలోనూ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి,తాడి రామకృష్ణ, మల్ల శ్రీను, కరణం నాయుడు, బర్నికాన రాము, అప్పికొండ గణేష్, వర్మ పాల్గొన్నారు.

మండలంలోని తుమ్మపాల, బవులువాడ గ్రామాల్లో తుపాను కారణంగా నష్టపోయిన పంటలను సీపిఐ జిల్లా బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ అప్పులు చేసి పెట్టి బడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపిఐ నాయకులు నరాలశెట్టి సత్యనారాయణ, కోరిబిల్లి శంకర్రావు, వియ్యపు రాజు, పప్పల ఈశ్వర్రావు, వియ్యపు రమణ, ఎం తాతారావు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న పైలా ప్రసాదరావు

కె.కోటపాడు : మండలంలోని అనేక పల్లపు గ్రామాల్లో వరి పంట పూర్తిగా నీట మునిగి ఉందని, వారందరికీ పంట నష్టాన్ని ప్రభుత్వం అందజేయాలని సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ బృందం కింతాడ, సింగన్నదొరపాలెం, దాలివలస, గవరపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు.

నర్సీపట్నం టౌన్ : తుపానుతో తక్షణమే తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ డిమాండ్ చేశారు. గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం మండలాల్లో కల్లాలలో తడిసిన ఆరబెట్టిన ధాన్యాన్ని, పొలాల్లో నీటిలో మునిగిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ, నష్టపోయిన ఆహారపు పంటలకు ఎకరానికి 40000, వాణిజ్య పంటలకు 75 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఐ నాయకులు పొట్టిక సత్యనారాయణ, మాకిరెడ్డి రామునాయుడు గొల్లు గురుబాబు, శివలంక కొండలరావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రధాన రహదారి మధ్యలో కుంగిపోయిన కల్వర్టు

భారీ వర్షాలకు కుంగిన కల్వర్టు

నిలిచిన వాహనాల రాకపోకలు

ప్రజాశక్తి -వడ్డాది

బుచ్చయ్యపేట మండలం బిఎన్ రోడ్డులోని బంగారుమెట్ట లోపూడి మధ్య డాల్ఫిన్ డెయిరీ వద్ద తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కుంగిపోయింది. గతంలో భారీ వర్షాలకు వరద నీరు పొంగి వడ్డాది వంతెన దెబ్బ తినడంతో నర్సీపట్నం నుండి చోడవరం వచ్చే బస్సులు వడ్డాది ఆర్చి వరకు నడిపేవారు. ఇప్పుడు లోపూడి వద్ద మదం కుంగిపోవడంతో ఆ అవకాశం లేక బస్సులను రావికమతం వరకే నడుపుతున్నారు. దీంతో బంగారుమెట్ట, ఎల్లిపి అగ్రహారం గ్రామ ప్రజలు ఇటు రావికమతం నర్సీపట్నం, అటు చోడవరం అనకాపల్లి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.

తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టాలి : టిడిపి

బుచ్చయ్యపేట : మండలంలోని లోపూడి డాల్ఫిన్ డెయిరీ వద్ద బి.యన్ రోడ్లో కూలిపోయిన కల్వర్టును టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి భత్తుల తాతయ్య బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.ఎన్ రోడ్లో ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయని, కల్వర్టు భారీ వర్షాలకు కూలిపోవడంతో వాహనదారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు.

టిడిపి కార్యకర్తల సహాయక చర్యలు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మిచౌంగ్ తుపాను ప్రభావంతో వీచిన గాలులకు మండలంలోని అన్నవరం, వెంకయ్యగారిపేట మధ్య రోడ్డు అడ్డుగా చెట్లు పడిపోయాయి. దీంతో టిడిపి కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లును తొలగించారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

తుఫాన్లో పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం ఆయన అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణతో కలిసి మండలంలో జన్నవరం, భోగాపురం, కణంపాలెం, బెన్నవోలు గ్రామాల్లో పంటలు నీట మునిగిన పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు చేతికొచ్చిన పంట కళ్ళముందే నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ బి తిరుమల బాబు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన కుమారి ఈశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సర్పంచులు కొనసం సన్యాసిరావు, మూడెడ్ల శంకర్రావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులెవరూ అధైర్య పడొద్దని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పిటిసి సభ్యురాలు ఈర్లె అనురాధ రైతులకు భరోసా ఇచ్చారు. తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలను గురువారం అధికారులతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో 668 ఎకరాల వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, 909 మంది రైతులకు నష్టం జరిగిందని తెలిపారు.

నీటిలో ఉన్న వరి పనలను చూపుతున్న రైతు

కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్, వైసిపి నాయకులు దాట్ల శివాజీరాజు, వేచలపు దొరబాబు, చీపురుపల్లి అచ్చిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని దేవరాపల్లి, కాశీపురం, చిననందిపల్లి గ్రామాలలో ముంపుకు గురైన వరి పంటలను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు కర్రి సూరి నాయుడు, రొంగలి నారాయణమ్మ, బండారు దేవుడునాయుడు, చలుమూరి చంద్ర మోహన్, మంగు నాయుడు, పోతల రఘు పరిశీలించారు.

సబ్బవరం : నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాలని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి వ్యవసాయ శాఖ సిబ్బందిని కోరారు. మండలంలో దెబ్బతిన్న వరి పంట పొలాలను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో గుల్లేపల్లి సర్పంచ్ బండారు మంగ శ్రీనివాస్, భాస్కరరావు, ఏఏఏ హేమలత, వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని వెంకుపాలెం గ్రామంలో వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ నేలమట్టమైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలకు రెండు రోజులలో నష్టపరిహారం అందేలా అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరము గ్రామంలో జెడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు నర్మల కుమార్, వైసీపీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి తదితరులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు, నాయకులు చిన్ని శ్రీనివాసరావు చిన్ని సత్యారావు, ఎర్రవరం గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాము, మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద పాల్గొన్నారు.

నీటిలో మునిగిన పంటను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి తదితరులు

12 నుండి అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-అనకాపల్లి :అంగన్వాడీ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8 నుండి తలపెట్టిన సమ్మె డిసెంబర్ 12కి వాయిదా వేయడం జరిగిందని, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది అంగన్వాడీ ఉద్యోగులు చేయ తలపెట్టిన సమ్మె రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి చర్చించి సమస్యలు పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని, డిసెంబర్ 11న యూనియన్‌తో జాయింట్ మీటింగ్ వేసి చర్చిస్తామని అప్పటివరకు వాయిదా వేయమని కోరడంతో డిసెంబర్ 12కి సమ్మెను వాయిదా వేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీల కన్నా అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తానన్న జగన్మోహన్ రెడ్డి గారి హామీని అమలు చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్ అయిన తరువాత జీతాలు సగం పెన్షన్ ఇవ్వాలని, ఇతర డిమాండ్లపై ఈ సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమా నారాయణమ్మ, ఉషా జ్యోతి పాల్గొన్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : తుపానుకు దెబ్బతిన్న వరి పంటపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని మల్లునాయుడు పాలెం వారు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తడిసిన ధాన్యం పై ఉప్పు ద్రావణం పిచికారి చేయడంతో వరి గింజలు మొలకెత్తకుండా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఏఏ హేమలత, విద్యార్థులు బి.భారతి, బి.స్నేహస్రావ్యాని, ఎస్.సుప్రియ, కె.పుష్పాంజలి, సిహెచ్.మాధురి తదితరులు పాల్గొన్నారు.

అరకేజీ పంచదార ఇవ్వడం సరికాదు

ప్రజాశక్తి- అనకాపల్లి : రేషన్ షాపుల్లో కార్డుదారునికి కేజీ పంచదార ఇవ్వవలసి ఉండగా అరకేజీ చొప్పున ఇవ్వడం దుర్మార్గమని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ .భద్రం, మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు తీవ్రంగా మండిపడ్డారు. కందిపప్పు కూడా కార్డుదారులకి పూర్తి స్థాయిలో అందించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఏమీ కొనలేక, తినలేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే జగన్‌కు పడుతుందని హెచ్చరించారు.

మృతుని కుటుంబానికి పరిహారం అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్థానిక ఎస్ఇజెడ్‌లోని అజిత్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడు సుందరపు సత్యారావు కుటుంబానికి గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చేతుల మీదుగా రూ.10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలని నాడు సిఐటియు, జనసేన ఆధ్వర్యాన స్థానికులు ఫ్యాక్టరీ ఆవరణలో ఆందోళన చేపట్టారు. యాజమాన్యం స్పందించి 10 లక్షల రూపాయల పరిహారం ఇవ్వడానికి అంగీకరించింది. ఈ మేరకు కంపెనీ ఇచ్చిన పరిహారం గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమార వర్మ, మడుతురు ఎంపిటిసి సభ్యుడు శనివాడ జువాల నాయుడు, గ్రామ సర్పంచ్ మోటూరు సంజీవ్ , వైఎస్ఆర్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు, కోన బుజ్జి, పి వాసు రాజు, బలిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వడ్డాది వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వడ్డాది : తుఫాన్ కారణంగా క్రుంగిపోయిన బుచ్చయ్య పేట మండలంలోని వడ్డాది వద్ద గల వంతెనను గురువారం చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వడ్డాది శారదా నదిపై ఉన్న బ్రిడ్జికి 40శాతం డ్యామేజ్ జరిగిందని తెలిపారు. దీంతో మూడు రోజులుగా చోడవరం-నర్సీపట్నం మధ్య రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ ఉషారాణి, జెడ్పిటిసి దొందా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

15 నుండి క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఈనెల 15వ తేదీ నుండి క్రషింగ్ ప్రారంభించడానికి సన్నద్ధం చేస్తున్నామని ఫ్యాక్టరీ ఎండి వి సన్యాసినాయుడు తెలిపారు. సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే ముందు లాంఛనంగా బ్రాయిలర్ పూజ కార్యక్రమం గురువారం సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు చేశారు. అనంతరం బ్రాయిలర్లో నిప్పువేసి వెలిగించారు.

కళా మందిరం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని గొబ్బూరు గ్రామంలో జై శ్రీఅభయాంజనేయ గౌరీ సంఘం ఆధ్వర్యంలో గౌరీ కళ్యాణ కళామందిరం నిర్మాణానికి వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ గురువారం ఉదయం శంకుస్థాపన చేశారు. ముందుగా గ్రామంలో గల వినాయక మందిరం, పరదేశమ్మ ఆలయంలో రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు రత్నాకర్ ను శాలువాతో సత్కరించారు. సంఘం అధ్యక్షులు మళ్ల సూర్యప్రకాశరావు, కార్యదర్శి, మాజీ సర్పంచ్ బుద్ద మల్లికార్జునరావు(శ్రీను) మాట్లాడుతూ బుద్ద కుటుంబీకులకు కళ్యాణ మండప నిర్మాణానికి సుమారు 40 సెంట్ల స్థలం విరాళంగా ఇవ్వడంతో ఆ స్థలంలో అందరి సహకారంతో సుమారు రూ.65 లక్షలతో కళామందిరం నిర్మిస్తున్నట్లు రత్నాకర్‌కు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మళ్ల మణి గోపి, మళ్ల సూర్యారావు, మళ్ల బాబు, మళ్ల సత్యనారాయణ, మళ్ల ప్రకాశరావు, ఆడారి సన్యాసినాయుడు, భీశెట్టి మహాలక్ష్మీనాయుడు, కాంగ్రెగుల నాగరమేష్, పప్పల మహాలక్ష్మీనాయుడు, ఇందల రమణ, శంకర్, పచ్చికూర శ్రీను, మళ్ల రమేష్, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కైట్స్‌లో సాయుధ దళాల జెండా దినోత్సవం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సాయుధ దళాల జెండా దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం అచ్యుతాపురం కైట్స్ కళాశాల, భవాని విద్యానికేతన్‌లో రాష్ట్ర సైనిక్ సెల్ కో కన్వీనర్ అగాల హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విశాఖ జిల్లా సైనిక్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో సాయుధ దళాల జెండా దినోత్సవం ప్రాముఖ్యతను అగ్గాల హనుమంతరావు వివరించారు. రక్షణ దళాలలో అమరవీరులు, సేవలందిస్తున్న సిబ్బందిని గౌరవించడానికి భారతదేశంలో డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం గా పాటిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కైట్స్ కాలేజీ నుండి చిరంజీవి రెడ్డి, గణేష్ రెడ్డి, భవాని స్కూల్ కరెస్పాండెంట్ సంతోష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సైనిక్ బోర్డు నుండి సుభాని, శ్రీనివాస్ పాల్గొన్నారు

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల పరిషత్ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ ప్రజా వేదిక జరగనుందని ఏపీఓ మురళి తెలిపారు. ఇటీవల గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను మండల స్థాయి ప్రజావేదికలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారుచేయాలి

ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు డాక్టర్ ఎన్.యువరాజ్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారయ్యేందుకు అధికారులు కృషి చేయాలన్నారని ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు డాక్టర్ ఎన్ యువరాజ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టితో కలిసి గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో తప్పక నమోదవ్వాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఓటర్ల లిస్టులో జనాభాపరంగా, స్త్రీ పురుష పరంగా తగిన నిష్పత్తిలో ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను వివరించారు. ఎక్కడా రాజీ పడకుండా అవసరమైన రుజువులతో జాబితా తయారు చేయాలన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

అర్హత గల ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా రాజకీయ పార్టీలు సహకరించాలని డాక్టర్ ఎన్.యువరాజ్ కోరారు. అధికారులతో జరిగిన సమావేశం అనంతరం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఒకసారి తొలగించిన ఓట్లే తిరిగి వస్తున్నాయని టిడిపి ప్రస్తావించగా ఇటువంటి విషయంలో బిఎల్ఓపై చర్యలు తప్పవన్నారు. జిల్లాలో అందిన ఫిర్యాదులపై అధికారులు స్పందించి మార్పులు చేర్పులు తొలగింపులు చేశారని రాజకీయ పార్టీల వారు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, ఈఆర్ఓలైన ఆర్డీవోలు హెచ్.వి. జయరాం, ఎ.చిన్నికృష్ణ, ఎస్‌డిసిలు డి.ప్రమీల గాంధీ, కెవి.రామలక్ష్మి కె.మనోరమ, టి.ఈ.ఎం. రాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, రవికుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బుద్ద నాగ జగదీశ్వరరావు (టిడిపి) సిహెచ్.నాగేశ్వరరావు (బిజెపి) పి.రామకృష్ణ (వైసిపి) డి .సంతోష్ (కాంగ్రెస్) ఏ.రాజు (సిపిఎం), జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యువరాజ్, చిత్రంలో కలెక్టర్ తదితరులు

ఓటర్ లిస్టులో అవకతవకలపై ఫిర్యాదు

కొత్త ఓటర్ లిస్టులో అవకతవకలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశం నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చనిపోయిన వారు, వలస వెళ్లిన వారు, డబుల్ ఎంట్రీలు 79,559 మంది ఉన్నారని వాటిని తొలగించమని గతంలోనే చెప్పినప్పటికీ వాటితోనే కొత్త ఓటర్ లిస్టు ఇచ్చారని తెలిపారు. దీనిపై అనకాపల్లి జిల్లా ఎన్నికల పర్యవేక్షకులు యువరాజు సమాధానం చెబుతూ ఈనెల 15వ తేదీ లోపు అన్ని సరిచేసి కొత్త ఓటర్ లిస్టులు ఇస్తామని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుచేయాలని ధర్నా

ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఈ చట్టం అమలైతే ప్రజలకు కలిగే ముప్పును వివరించారు. సివిల్ కోర్ట్ పరిధి నుంచి రెవెన్యూ పరిధిలోకి భూ వివాదాలకు సంబంధించి చట్టాన్ని తేవడంతో ప్రజల మధ్య వివాదాలు పెరిగిపోతాయని తెలిపారు. సామాన్య ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతారన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా చట్టాన్ని తొలగించే వరకు న్యాయవాదులు ఎవరు విధులు చేపట్టకూడదని నిర్ణయించినట్లు చెప్పారు. అనంతరం విధులను బహిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు సాయి లక్ష్మణ్ నేతృత్వంలో జరిగిన ధర్నాలో బార్ సెక్రెటరీ సీనియర్ న్యాయవాదులు పిళ్లా హర శ్రీనివాస్, కుమార్, బాలగంగాధర్ తిలక్, పిఎస్ పట్నాయక్, సుధాకర్, జగపతి, గోవింద్, సుంకర శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి వారి కార్యాలయం, జిల్లా 'మిషన్ వాత్సల్య' పథకంలో ఖాళీగా ఉన్న 23 పోస్టులను కాంట్రాక్టు / పార్ట్ టైమ్ పద్ధతిలో భర్తీ చేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. డిసిపియు (అనకాపల్లి) 10 పోస్టులు, ఎస్ఎఎ (అనకాపల్లి) 10 పోస్టులు, చిల్డ్రన్ హోమ్ (కశింకోట) 2 పోస్టులు, చిల్డ్రన్ హోమ్ (నర్సీపట్నం) ఒక పోస్టుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు కోరుతున్నారు. https:// anakapalli. ap.gov.in అనే వెబ్‌సైట్ నుండి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు పూర్తి చేసి ఈ నెల 6 నుండి 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వారి కార్యాలయం, ప్లాట్ నెంబర్-3 లోకాంబిక ఆలయం వద్ద, బెస్ట్ ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఎదురుగా, అనకాపల్లి అన్న అడ్రస్‌లో అందజేయాలని కోరారు. Mail.id dcpuakp016@gmail.com% ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తుపాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- అనకాపల్లి

తుపాను బాధితులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం తీవ్ర విఫలమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల పాటు విపరీతమైన గాలులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అనకాపల్లి జిల్లాలో అత్యధిక భాగం వరి పంట మునిగిందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 32 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, 420 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. పలుచోట్ల దెబ్బతిన్న ఇల్లు, ఆవులు, పాడైన మగ్గాలు ఆందోళనలో రైతులు ఉన్నారని, సహాయక చర్యలు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం, వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. జగన్ రెడ్డి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూనూరు మల్లు నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దాడి ముసలి నాయుడు పాల్గొన్నారు.

నూరుశాతం సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని జెడ్పిటిసి కర్రి సత్యం అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి, జగనన్న మా నమ్మకం -మా భవిష్యత్తు అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు నాయకత్వంలో మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షులు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహచలంనాయుడు, వైస్ ఎంపిపి ఉరోకుల గంగా భావని, జెఎసిసి కన్వీనర్ కెవి రమణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి -కసింకోట : మండలంలోని సాగర్ సిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికుడు ఓమ్మి శ్రీనివాసరావు డ్యూటీ పూర్తి చేసుకుని మంగళవారం రాత్రి ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదానికి గురై మరణించారని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు నాయకులు ఆర్.శంకరరావు, దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం వారు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతునికి భార్య సత్యవతి, కుమార్తె జనని, కుమారుడు వెంకటేష్, తల్లి కోటమ్మ వున్నారని, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాసరావు మృతితో వారు ఎలా బతకాలో తెలియని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీతో పాటు ఆర్థిక సాయం అందించాలని, తోటి కార్మికులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

గుంతల రోడ్డుపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి - చోడవరం రోడ్‌ను తక్షణమే మరమత్తులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం చోడవరం రోడ్‌లోని వర్షపు నీటితో ఉన్న గుంతల్లోకి దిగి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి అమర్నాథ్ నియోజిక వర్గంలో రోడ్లు చెరువులుగా మారిపోయి ప్రయాణికులు నిరంతరం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రి అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ ప్రయాణం చేసినప్పుడు వాళ్ళ కళ్ళకు గుంతల పడ్డ రోడ్లు కనపడలేదా? అని దొరబాబు ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు, పప్పల ఈశ్వరరావు, నరాలశెట్టి సత్యారావు, వియ్యపు రమణ పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న దిలీప్ కుటుంబం

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ కుటుంబ సభ్యులతో సహ దర్శించుకున్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నడిపిస్తున్న జగన్మోహన్ రెడ్డి తిరిగి రానున్న ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్షించినట్లు దిలీప్ కుమార్ తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆడుదాం ఆంధ్రా గోడ పత్రికను మండలంలోని తారువలోని డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పురుషులు, మహిళలు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నామని, ఆసక్తి కలిగిన వారు ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా లేదా సమీపంలోని సచివాలయంలో పూర్తిస్థాయి వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ, వీఆర్వో పోతల శంకరరావు, చల్లా నాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో తడిసిన ధాన్యం కొనుగోలు

డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు

పంటలను పరిశీలిస్తున్న బూడి

ప్రజాశక్తి -చీడికాడ:తుఫాన్ కారణంగా వరి, చెరుకు, ఇతర పంటల నష్టాన్ని అంచనా వేయించి తగిన నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చి రైతులను ఆదుకుంటుందని డిప్యూటీ సిఎం, మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన గురువారం మండల నాయకులతో స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా రైతులు కష్టించి పండించిన వరి పంటలు నీటిపాలు కావడం బాధ అని పించిందన్నారు.తుఫాన్‌కి ముందుగా అధికారులను, రైతులను అప్రమత్తం చేయడంతో నష్టం కొంత మేర తగ్గిందన్నారు. నీటిలో మునిగిన పంటలను అధికారులతో అంచనా వేయించి నివేదికలను నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. వారం రోజుల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సిబ్బందిని సిద్ధం చేసి చేపడతామని మంత్రి అన్నారు. తుఫాన్ కారణంగా పెంకిటిల్లులు పడిపోయిన, పాడైనా పది వేలు అందజేయాలని అధికారులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు జి.రాజబాబు, జిల్లా రైతు అధ్యక్షులు ఎర్ర అప్పారావు, నాయకులు కురచా నారాయణమూర్తి, పాల సంఘం అధ్యక్షులు కొండబాబు, యువజన అధ్యక్షులు స్వామి నాయుడు, పడాల అప్పలనాయుడు, శ్రీను సలాది శేషు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బూడి పర్యటన

మాడుగుల: మండలంలోని తుఫానుతో ముంపుకు గురైన ప్రాంతాలను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు. గురువారం తుఫానుతో మండలంలో జరిగిన నష్టాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తుఫాను దాటికి నీట మునిగిన రైతులను పరామర్శించి ఓదార్చారు.

ఈ సందర్భంగా ముత్యాలనాయుడు నష్టపోయిన రైతులతో మాట్లాడుతూ జరిగిన విపత్తు వల్ల వాటిల్లిన నష్టాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాను కారణంగా వచ్చిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి ప్రభుత్వంకు నివేదిక అందించాలని సూచించారు. మాడుగుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎం.పోలినాయుడు పర్యవేక్షణతో నియోజకవర్గంలో నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం అందించే విధంగా సూచనలు అందించారు. రైతులు ధైర్యం వహించాలని ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు అందిస్తామని ముత్యాల నాయుడు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో లోతట్టు ప్రాంతాలైన వీరవిల్లి అగ్రహారం, పోతనపూడి, గొట్టివాడ అగ్రహారం, చింతలూరు వీరనారాయణం, అలాగే గండిపడిన కలవట్లను, చిన్న గొర్రెగడ్డ గ్రామానికి చెందిన వంతెనను పరిశీలించారు. మండలంలో వాహనాలు ప్రయాణం చేయలేని ప్రాంతాలలో ద్విచక్ర వాహనంపై మంత్రి పర్యటించిపరిస్థితులు తెలుసుకున్నారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ తాళపు రెడ్డి వెంకట రాజారామ్, డిప్యూటీ తాసిల్దార్ పి సత్యనారాయణ, నీటిపారుదల శాఖ ఏఈ భార్గవ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు మరికొంద ప్రభుత్వ అధికారులు,స్థానిక గ్రామ నాయకులు రైతులు ఉన్నారు.

పరిశీలిస్తున్న హెచ్ఎం, ప్రజాప్రతినిధులు

కూలిన హైస్కూల్ ప్రహరీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్లలో తుఫాన్ ప్రభావానికి కురిసిన వర్షానికి హైస్కూల్ ప్రహరీ గోడ కుప్ప కూలి పోయింది. గురువారం హెచ్ఎంతో పాటు సర్పంచ్ భర్త అల్లు రమణ, తదితరులు కూలిన గోడను పరిశీలించారు. సుమారుగా రెండు లక్షల నష్టం వాటిల్లినట్లు హెచ్ఎం తెలిపారు. అధికారులు స్పందించి ప్రహరి గోడ మంజూరు చేయాలని అల్లు రమణ కోరారు.

వరద నీటిలోనే పంట పొలాలు

-దెబ్బతిన్న రహదారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:తుఫాను ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాలు నేటికీ నీటిలోనే ఉన్నాయి. మండలంలో సుమారు 980 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు సరోజిని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది వివిధ గ్రామాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు.

మండలంలో కోటవురట్ల, రాజుపేట, జల్లూరు, చౌడవాడ, కైలాసపట్నం గ్రామాలలో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. చౌడవాడ గ్రామంలో మిరప తీవ్రంగా నష్ట పోయామని అధికారులు గుర్తించి నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

అదేవిధంగా కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారి వద్ద పూడికతీతలో భాగంగా రోడ్డును కొట్టివేయడంతో గ్రామస్తులు సహా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు, రైతులు, మహిళలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు.

వరద నీటిలో వరి పంట

తుపాను బాధితులను ఆదుకోవాలి

పంటలను పరిశీలిస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో మిచౌంగు తుఫాన్ కారణంగా నష్టపోయిన తమలపాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. తమలపాకు తోటలను పరిశీలించడం జరిగింది. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ తమలపాకు రైతులు ఎకరానికి రెండు లక్షల యాభై వేలు రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెద్ద గుమ్ములూరు శివారు లీలాద్రపురం గ్రామంలో గురువారం పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట చేతికొచ్చే సమయానికి తుఫానుతో తడిసి ముద్దవ్వడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు.

చీడికాడ: తుఫానుతో పంటలు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు ఆర్.దేముడు నాయుడు, గంటా సింహాచలం నాయుడు డిమాండ్ చేసారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో తుపానుతో నష్ట పోయిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం వారు మట్లాడారు. తుపానుతో వరి, చెరుకు, కాయగూరలు పంటలు నేల కొరిగాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో కుప్పలు తడిసి ముద్దయ్యాయని, ఈదురు గాలులకు వరి పంటతో పాటు ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు గంటా సింహాచలం నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు నాయకులు గురువారం విస్తృతంగా పర్యటించి, తుఫాన్ కారణంగా ముంపునకు గురై నష్టపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా నాయకులు వివి రమణ, సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వరి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిరిపురపు శ్రీనివాసరావు, గెడ్డం నాగేశ్వరరావు, పైలా అప్పారావు, రాజాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : తుఫాన్ వలన నష్టపోయిన రైతుకు ఎకరాకు 35 వేల రూపాయలు చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు పినపాత్రుని సాంబశివ రావు డిమాండ్ చేశారు. బుచ్చయ్యపేట మండలం, బంగారుమెట్ట, లోపూడి, ఎల్‌బిపి అగ్రహారం తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. దొండా వరహాలు దొర, పినపాత్రుని తాతయ్యబాబు, కొట్టాడ రమణ, బత్తుల రమణ, రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలో తుపాను వలన నష్టపోయిన పంటపొలాలను సిపిఎం నాయకులు పరిశీలించి, అనంతరం రైతులను ఆదుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ మండలంలోని అత్యధిక మంది వరి, కూరగాయల రైతులు ఉన్నారని, తుపాన్ వల్ల వారికి తీవ్రమైన నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె.సన్నిబాబు, నండా సన్నిబాబు, చోక్కాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తుఫాన్ కారణంగా రైతులు, కౌలు రైతులకు అధిక నష్టం జరిగిందని, వారిని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము, వివి శ్రీనివాసరావు, జి దేముడు నాయుడు డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో గత మూడు రోజులుగా సిపిఎం బృందాలు గ్రామాలలో పర్యటించి నీట మునిగి, దెబ్బతిన్న పంటలను పరిశీలించినట్లు చెప్పారు. రైతులతో పాటు కౌలు రైతులకు పరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బొట్టా శ్రీను, నూకన్న పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గురువారం బాబు షూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పథకాలపై ప్రచారం చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోతో మహిళలకు, నిరుద్యోగులకు, అన్ని వర్గాల ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని, అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని వివరించారు.

పనులు పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

వీవర్స్ కాలనీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మిచౌంగ్ తుపాన్ ప్రభావానికి ముంపునకు గురైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో గురువారం ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. వీవర్స్ కాలనీ ముంపునకు గురి కావడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో చేనేత మగ్గాలు, ముడి సరుకులు, సామాగ్రి తడిసి చేనేత కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, ఈఓపిఆర్‌డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కాలనీలో శానిటేషన్ పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ జల్లించారు. డిఎల్‌పిఓ మూర్తి కాలనీలో పర్యటించి, శానిటేషన్ పనులను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శానిటేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు .

'ఎకరా స్థలం కేటాయించాలి'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అనకాపల్లి జిల్లా హెడ్ క్వార్టర్‌లో అంబేద్కర్ సామాజిక భవనానికి ఒక ఎకరా స్థలం, కోటి రూపాయలు నిధులు ప్రభుత్వమే కేటాయించాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సమావేశాలకు అంబేద్కర్ సామాజిక భవనం ఎంతో అవసరమన్నారు. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి భవనానికి స్థలం కేటాయించాలని కోరారు.

పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు గ్రామంలో వరి పొలాలను కెవికె కొండెంపూడి శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాజకుమార్, సత్తిబాబు మాట్లాడుతూ, పొలంలో ఉన్న నీరు బయటకు వెళ్ళేటట్లు కాలువలు తీసుకోవాలన్నారు. కోసిన పనలను గట్లపై అరబెట్టాలని, గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటిలో 50గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణం స్ప్రే చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి -యస్.రాయవరం:తుపానుతో తీవ్రంగా నష్ట పోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. బంగారమ్మపాలెంలో తుపానుతో బోట్లు, వలలు, ఇంజన్లు పూర్తిగా నష్టపోయిన బాధిత మత్స్యకారులను సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పార్టీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. దెబ్బతిన్న బోట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గత వారం రోజులుగా తుఫాన్ కారణంగా వేటకు వెళ్లక ఉపాధి లేకుండా ఉన్న మత్స్యకారులకు బియ్యం, నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, వి.అప్పలరాజు, వై.రామకృష్ణ, సి.హెచ్.రమణ పాల్గొన్నారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం అందజేశారు. నర్సీపట్నం మండలం ధర్మసాగరంకు చెందిన తోటకూర సీతారాం అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన భార్యకు 2లక్షలు, కానేటి ఆనంద్‌కు రూ.70వేలు, నారికానపు సంధ్యకు రూ.18వేలు, యామగిరి నూకరాజుకు రూ. లక్షా20వేలు, భీమిరెడ్డి స్వామినాయుడుకు రూ.56వేలు, బంగారు లోవతల్లికి రూ.52వేలు, జాలరి గంగాతల్లికి రూ.60వేలు మొత్తం రూ.5.76లక్షల చెక్కులను ఏడుగురికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చిత్రపటం ఇస్తున్న ప్రధాన అర్చకులు

వెంకన్నను దర్శించుకున్న డిఐజి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్నను విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ దంపతులు గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ ఇన్స్పెక్టర్, సిబ్బంది స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకన్న జ్ఞాపికను అందజేశారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ అప్పన్న, ఎస్ఐ విభూషణరావు పాల్గొన్నారు..

ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు రంధ్రం

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని కండివరం-వి.మాడుగుల మార్గ మధ్యలో మోసూరు కల్లాల వద్ద కూలిన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ నరసింహమూర్తి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోసూరు సన్నిబాబు కల్లాల ముందు ఉన్న కల్వర్టు గతంలోనే పాడై గొయ్యిలు ఏర్పడటంతో వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిందన్నారు. దీంతో, వాహన ప్రయాణదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు.అధికారులు, నాయకులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు.

తుపాను నష్టాలపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మిచౌంగ్ తుపాను బాధిత ప్రజలకు సహాయం అందివ్వాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుపాను ప్రభావం విశాఖ జిల్లాలోని ప్రజలపై తీవ్రంగా పడిందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, భవన నిర్మాణం, చిరువ్యాపారులు తదితర అసంఘటితరంగ కార్మికులకు తీవ్ర కష్టాలను కల్పించిందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు,రోడ్లు, రక్షణగోడలు వంటి ప్రజల మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వర్షంనీరు, మురుగునీరుతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని వివరించారు. సంబంధిత విభాగాల అధికార యంత్రాంగంతో తుపాను నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయించి, బాధితులకు పరిహారం, సహాయం, మౌలికసదుపాయాల పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంట నీటమునిగిన రైతులకు, కౌలు రైతులకు తగు నష్టపరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యంతో సహా, రైతుల ఇతర పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరలకు వెంటనే కొనుగోలు చేయాలని, అన్నదాతలకు పంటల బీమా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపాధి కోల్పోయిన మత్స్యకార్మికులు, మత్స్యకారులకు, చేతివృత్తిదారులకు తగు ఆర్థికసహాయం అందించాలని, ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ, చిల్లర వర్తకులు తదితర అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డుల ద్వారా కనీసం రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్, రక్షణ గోడలు తదితర మౌలిక సదుపాయాలను వెంటనే పునర్నిర్మాణం చేయాలని, మంచినీటిని పూర్తిస్థాయిలో అందించాలని, కమ్ములు, రేకులు, పెంకులు తదితర తాత్కాలిక ఇళ్లల్లో నివసిస్తున్న వారందరికీ అవే స్థలాల్లో పక్కాగృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున సహాయం అందించాలని, ముంపునకు గురైన ప్రాంతాల్లో పటిష్ట డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటుచేయాలని, తక్షణమే అంటురోగ నివారణా చర్యలు చేపట్టాలని, ఇంట్లో వస్తువులు ధ్వంసమైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, తుపాను బాధితులకు 14 రకాల నిత్యవసర సరుకులు ఉచితంగా సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలతో సమగ్ర పరిశీలన జరిపించి, తుపాను బాధిత ప్రజలందరికీ పూర్తిస్థాయి పరిహారం సకాలంలో అందించే చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఎటువంటి విపత్తులు సంభవించినా నివారించగల వ్యవస్థలను పటిష్టం చేయాలని కోరారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

అడిషనల్ సిఇఒ ఎం.ఎన్.హరేంద్రప్రసాద్

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు పెండింగులో ఉన్న దరఖాస్తులపై దృష్టి సారించాలని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్లను కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులపై జిల్లా జాయింట్ కలెక్టర్లతో గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లాలో గత అక్టోబర్ 27 నుంచి ఇప్పటివరకు 776 ఫారం - 8లు స్వీకరించామని, వాటిలో 705 పరిశీలించి గుర్తించామన్నారు. మిగిలిన 71 ఫారాల్లో ఇద్దరు ఎన్ఆర్ఐలు ఉన్నారని తెలిపారు. వీటితో పాటు ఫారం-7 దరఖాస్తులు 28 వచ్చాయని, వాటిలో 21 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. పెండింగు దరఖాస్తులన్నీ వారంలోగా పూర్తిచేస్తామని వివరించారు. జిల్లాలో ఎటువంటి జంక్ కేర్లర్లు లేవని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖపట్నం : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి వచ్చే జనవరి 11వరకు జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లుచేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మాసోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా వసతులను కల్పించాలని సూచించారు. మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, విద్యుత్ తదితర సదుపాయాలపై సంబంధిత శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మార్గశిర మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కనకమహాలక్ష్మి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి కె.శిరీష, సహాయ కార్యనిర్వహణ అధికారి కె.తిరుమలేశ్వరరావు, జివిఎంసి అదనపు కమిషనర్ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమ్ ఆద్మీ పార్టీ అభివృద్ధికి కృషి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ నూతన రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ కుమార్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2013లో అవినీతికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం తరువాత ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపించిన అరవింద్ కేజ్రీవాల్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడినై ఆ పార్టీలో 2013లో చేరానన్నారు. పార్టీలో పలుస్థాయిల్లో పని చేసి గత నెల 26న విజయవాడలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను తెలియచేస్తూ, పార్టీ విస్తృతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి ఉదయ్ భాస్కర్, రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్‌మదన్, రాష్ట్ర ఐటీ ఇన్‌ఛార్జి బివిఆర్.పవన్, జిల్లా అధ్యక్షులు రవి భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపో మేనేజర్ ధీరజ్

రావికమతం వరకే బస్సులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వడ్డాది బ్రిడ్జి, బంగారుమెట్ట వద్ద కల్వర్టు దెబ్బతిన్న కారణంగా నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే బస్సులను రావికమతం వరకు మాత్రమే నడపటం జరుగుతుందని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వర్టు మరమ్మతులు పూర్తి కాగానే తిరిగి యథావిధిగా బస్సులు నడుస్తాయని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

రాష్ట్రంలో ఓట్లు తొలగింపు

కుంభకోణం : బివి.రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితాలో లక్షలాదిమంది ఓట్లను తొలగించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున కుంభకోణానికి పాల్పడ్డారని తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం అమరావతిలో రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఓట్ల తొలగింపు ద్వారా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో పాటు, టిడిపి, జనసేన అభ్యర్థులంతా ఎన్నికల్లో నెగ్గకుండా చేయాలనేదే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆరోపించారు. ఇంత పెద్ద కుట్రకు పాల్పడిన ముఖ్యమంత్రిపై సెక్షన్ 124 ఎ, సెక్షన్ 409, సెక్షన్ 420 ప్రకారం కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గరుడా యాప్ కారణంగా ఓట్లు గల్లంతయ్యాయన్నారు. పదేళ్లుగా బెయిల్ పై ఉన్న వ్యక్తికి ఎన్నికలలో పోటీ చేసే అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు.

పాకలపాడు రోడ్డు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం పాకలపాడు నుంచి రావణాపల్లి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. రెండు కిలో మీటర్ల మేర ఈ రోడ్డంతా పూర్తిగా దెబ్బ తినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలు పాలైన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

రహదారి గోతుల్లో చేరిన నీరు